# అంగట్లో అంగన్‌వాడీ గుడ్లు

- విక్రయిస్తుండగా పట్టుకున్న పంచాయతీ సిబ్బంది
- గతంలోనూ మార్కెట్‌లో విక్రయం
- చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు



చౌడాపూర్‌లో ఓ కిరాణంలో విక్రయానికి పెట్టిన కోడిగుడ్లు

కులకచర్ల, ఏప్రిల్ 27 : చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ద్వారా అందించాల్సిన కోడి గుడ్లను ఓ వ్యక్తి అంగట్లో అమ్మకానికి పెట్టాడు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పంచాయతీ సిబ్బంది పట్టుకున్నారు. ఈ ఘటన చౌడాపూర్ మండల కేంద్రంలో జరిగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి తెలిపిన వివరాలు.. చౌడాపూర్‌లో ఓ కిరాణా దుకాణంలో అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన కోడి గుడ్లను విక్రయిస్తున్నారు. ఈ విషయమై పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు సిబ్బంది ఆ దుకాణానికి వెళ్లి కోడిగుడ్లను పరిశీలించారు. వెంటనే ఆ దుకాణ యజమాని అంగన్‌వాడీకి చెందిన గుర్తు ఉన్న గుడ్లను కిందికి మార్చారు. గమనించిన సిబ్బంది వాటిని పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన గుర్తు ఉండడంతో వాటిని పంచాయతీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అంగన్‌వాడీ గుడ్ల ట్రేలో 23 గుడ్లు ఉండగా వాటిని సిబ్బంది స్వాధీనం చేసుకున్నా రు. గతంలోనూ ఇలాగే అంగట్లోనే అంగన్‌వాడీ గుడ్లను విక్రయిస్తుండగా మండల అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టుకున్నారు. ఆదివారం ఉదయం చౌడాపూర్ గ్రామంలోని కిరాణా దుకాణంలో అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన గుడ్లను విక్రయిస్తున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించి కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రానికి చెందినవిగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. కిరాఆఆఆఆఆ దుకాణంలో అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన కోడిగుడ్లను విక్రయిస్తున్న విషయాన్ని మండల అధికారులు, ఐసీడీఎస్ అధికారులకు తెలియజేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి తెలిపారు. చౌడాపూర్ మండల కేంద్రంలో పలుమార్లు కోడిగుడ్లను అమ్ముతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జనగామ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను భోజనానికి ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి...



మండలంలోని చేగూరు గ్రామానికి చెందిన తాజా మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ నేత రవిగౌడ్ ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరగా.. చేగూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ విఠల్‌ముదిరాజ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. - నందిగామ, ఏప్రిల్ 27

## దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష సరి కాదు

### సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

షాబాద్, ఏప్రిల్ 27: దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం బాధాకరమని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంటలో సీపీఐ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, నిర్మాణాలు, అభివృద్ధి విషయంలో చిన్న చూపు చూడడం, ఆర్థిక, రాజకీయ, సామాజిక పరంగా అన్నింటిలోనూ వివక్ష చూపడం ఏమిటని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల పార్టీ అని, వారి విధానాలతో దేశ ప్రజలకు అర్థమవుతున్నదని ఆయన తెలిపారు. దేశంలో ఉగ్రవాదులు చొరబడి 26 మంది అమాయకులను మట్టు పెట్టడం దిగ్భ్రాంతిని కలిగించిందని, ఇలాంటి ఉగ్రవాదాన్ని రాజకీయాలకు అతీతంగా దేశ ప్రజలంతా ముక్తకంఠంతో ఎదిరించి ఉగ్రవాదాన్ని మట్టుపెట్టాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పార్టీ సభ్యులు విధిగా పార్టీ జెండాను వాడవాడలా, పల్లె పల్లెనా ఎగరవేసి కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ప్రజలకు తెలిపేలా కార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గం కార్యదర్శి కె.రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఆనందం, నర్సింహులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు మేం సైతం..

- వరంగల్ చేరుకున్న బీఆర్‌ఎస్ నేత మల్లేశ్ బృందం
- గులాబీ అధినేత కేసీఆర్ తిరిగి సీఎం కావాలని...
- పడకల్ గ్రామం నుంచి ఎల్కతుర్తికి కార్యకర్తలతో కలిసి పాదయాత్ర
- సభ ప్రాంగణంలో స్వాగతం పలికిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



రజతోత్సవ సభ ప్రాంగణంలో కుమ్మరి మల్లేశ్‌కు స్వాగతం పలుకుతున్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్.

కడ్తాల్, ఏప్రిల్ 27 : వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించాలని, గులాబీ అధినేత కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ... తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు రజతోత్సవ సభకు పాదయాత్ర చేశారు. పడకల్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కుమ్మరి మల్లేశ్... పార్టీ కార్యకర్తలు కుమ్మరి యాదగిరి, డిల్లీ కుమార్, రావిచేడ్ మహేశ్, రాజయోగి, వేదవ్యాస్‌తో కలిసి వరంగల్ రజతోత్సవ సభకు ఐదు రోజుల కిందట పడకల్ నుంచి పాదయాత్రగా బయల్దేరారు. శనివారం రాత్రి ఎల్కతుర్తి సభ ప్రాంగణంలో మల్లేశ్‌తోపాటు కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు 218 కిలోమీటర్ల నుంచి పాదయాత్రగా వచ్చిన తమకు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అభినందించారని మల్లేశ్ తెలిపారు. పాదయాత్ర చేయడానికి ప్రోత్సహించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, బీఆర్‌ఎస్ తలకొండపల్లి మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## దేశంలో ఆర్థిక దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల ఇన్‌చార్జి రామస్వామి

మొయినాబాద్, ఏప్రిల్ 27 : దేశంలో జరుగుతున్న ఆర్థిక దోపిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల ఇన్‌చార్జి రామస్వామి అన్నారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో సీపీఐ మహాసభను గ్రామ కమిటీ కార్యదర్శి మల్లేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీ ప్రధాని అయిన తర్వాత పేదల సంపదను పెద్దలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. దేశంలో కొంత మంది చేతుల్లోనే 75 శాతం సంపద ఉందన్నారు. అదానీ, అంబానీలు వేల కోట్లు సంపాదించారని తెలిపారు. దేవ సంపద ప్రతి పేదవాడికీ దక్కాలన్నారు. కొందరికీ మాత్రమే పరిమితం కారాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్దమంగళారం నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ కార్యదర్శిగా మల్లేశ్, సహాయ కార్యదర్శులుగా రాములు, కిష్టయ్య, కమిటీ సభ్యులుగా మాధవి, అనురాధ, దర్శన్, సిద్ధయ్య, చంద్రకళ, యాదగిరి, లక్ష్మి, సురేశ్, ధనుంజయ్, సహదాబిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు



కందవాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయ విద్యార్థులు

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 27 : ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ మోజర్ల 2021 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ గ్రామంలో ఉద్యాన విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యాన పంటలు సాగు చేస్తూ సమగ్ర సస్య రక్షణ, సేంద్రియ వ్యవసాయం, పచ్చి రొట్టె పైర్లు, బహుళ అంచెల పంట సాగు, ఏడాది పొడవునా పంటల సాగు, అంతర పంటలు, కోల్డ్ స్టోరేజీ, పట్టు పురుగుల పెంపకం, బిందు సేద్యం, భూసార పరీక్షలపై రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు స్వాతి, అఖిల, ప్రీతి, లావణ్య, రచన, శారద, సంతోశ, సానియా, పూల పరిశోధన స్థానం ప్రిన్సిపాల్, సైంటిస్ట్ జ్యోతి, సైంటిస్ట్ ప్రణీత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

## బొలెరో-కారు ఢీ.. ముగ్గురు మృతి

కొడంగల్, ఏప్రిల్ 27 : బొలెరో, కారు ఢీ కొని ముగ్గురు మృతి చెందిన ఘటన కొడంగల్ మండల పరిధిలోని ఐనాన్‌పల్లి గేటు సమీపంలో ఆదివారం జరిగింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్న రామారావు (51), తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ మండల పరిధిలోని ముంబాపూర్ గ్రామానికి చెందిన శ్రీలత (42), ఆమె కుమార్తె శృతి ముగ్గురు కలిసి కారులో కర్ణాటక రాష్ట్రంలోని గాన్‌గాపూర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొడంగల్ మీదుగా వస్తున్న క్రమంలో ఐనాన్‌పల్లి గేటు వద్ద బొలెరో వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో శ్రీలత అక్కడికక్కడే మృతి చెందింది. రామారావు, శృతి కొడంగల్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.




ఆదివారం సెలవు దినం, విద్యాసంస్థలకు వేసవి సెలవులు కావడంతో ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా దూరప్రాంతాల నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో తరలివచ్చారు. చిన్నాపెద్ద తేడా లేకుండా ప్రాజెక్టులో సందడి చేశారు. ప్రాజెక్టు అందాలను తిలకించడంతోపాటు బోటింగ్ చేసేందుకు ఆసక్తి చూపారు. ఉదయమే ప్రాజెక్టుకు చేరుకొని సాయంత్రం వరకు ఇక్కడే ఉండి కుటుంబసమేతంగా వనభోజనాలు చేశారు. ప్రాజెక్టు నీటిలో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. ప్రాజెక్టులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. – ధారూరు, ఏప్రిల్ 27

## పాక్‌కు నలుగురు తరలింపు

### పోలీసుల అదుపులో మరో యువకుడు

సిటీబ్యూరో, ఏప్రిల్27(నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడి తర్వాత హైదరాబాద్‌లో పాకిస్థానీయులు ఉండకూడదంటూ కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో పోలీసులు వారి వివరాలపై ఆరా తీస్తున్నారు. పాకిస్థాన్ నుంచి షార్ట్‌టర్మ్ వీసాపై నగరానికి వచ్చిన పౌరులు నలుగురు ఉన్నట్లు గుర్తించారు. . ఒకరు శనివారం వెళ్లిపోగా ఆదివారం మరో ముగ్గురు కూడా వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. సిటీ పోలీసులు నోటీసులు జారీ చేయడంతో వారంతా వేర్వేరుగా విమానంలో దుబాయ్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. షార్ట్ టర్మ్ వీసా ఉన్నవారు ఆదివారం లోపు వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో షార్ట్ టర్మ్ వీసాపై వచ్చిన వారిలో ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి ఉన్నారు. వీరిలో ఓ చిన్నారితో వచ్చిన మహిళ, మరో మహిళ ఆదివారం వెళ్లిపోగా పురుషుడు శనివారం శంషాబాద్ నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. లాంగ్ టర్మ్ వీసాలున్న 11 మంది విషయంలో కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో వారికి నోటీసులు జారీ చేయలేదని వారు తెలిపారు. ఈ క్రమంలో వివిధ రకాల వీసాలపై నగరంలో ఉన్న 208 మంది వివరాలపై ఆరా తీయగా తెరపైకి వచ్చిన మరో అంశం హైదరాబాద్ డిటెన్షన్ సెంటర్‌లో బందీగా ఉన్న మహ్మద్ ఉస్మాన్ ఇక్రమ్ అలియాస్ మహ్మద్ అబ్బాస్ ఇక్రమ్ వ్యవహారం కీలకంగా మారింది. పాకిస్థాన్‌కు చెందిన ఇక్రమ్ విషయంలో ఖైదీలుగా ఉన్నా, కేసులు విచారణలో ఉండి పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ వారిని వెనక్కి పంపడానికి కేంద్రం అనుమతి లేదని పోలీసులు తెలిపారు. సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో డిపోర్టేషన్ సెంటర్‌లో ఇక్రమ్ ఉన్న కారణంగా అతడిని ఇప్పట్లో పాకిస్థాన్‌కు పంపాలా వద్దా అనే విషయంపై క్లారిటీ రావలసి ఉందని సీసీఎస్ పోలీసులు చెప్పారు.

## మూగవేదన!

- పశువుల దాహార్తి తీర్చని నీటి తొట్టెలు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు



అడవికి మేత కోసం వెళ్తున్న పశువులు



నీరు లేక నిరుపయోగంగా నీటి తొట్టె

వికారాబాద్, ఏప్రిల్ 27 : వేసవి కాలంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు నిరుపయోగంగా ఉన్నాయి. గత కొన్నేండ్లుగా వాటిల్లో నీటి పోయడంతో పశువులు దాహాన్ని తీర్చుకున్నాయి. ప్రత్యేక అధికారుల పాలనలో పశువుల తొట్టెల పర్యవేక్షణ గాలికొదిలేశారు. మోమిన్‌పేట మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామంలో పశువులు నీటిని తాగేందుకు రెండు తొట్లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పటి పాలకులు నీటి తొట్లలో నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చారు. దాదాపు రెండేండ్ల నుంచి రెండు పశువుల తొట్లలో నీరు లేక మూగజీవాలు దాహార్తిని తీర్చుకోలేక పోతున్నాయి. అప్పటి నుంచి వాడుకలోకి రాకపోవడంతో అవి చిన్న పాటి మరమ్మతులకు చేరుకున్నాయి. ప్రత్యేకాధికారుల నిర్లక్ష్యం కారణంగా పశువుల తొట్టెలు నీరు లేక నిరుపయోగంగా మారాయి. ప్రత్యేకాధికారులు, సంబంధిత అధికారులు గ్రామంలో పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎండలు మండిపోవడంతో పశువులు నీటి కోసం అవస్థలు పడుతున్నాయని పోషకులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లలో నీటిని నింపితే మూగజీవాల దాహార్తిని తీర్చిన వారవుతారని ప్రజలు కోరుతున్నారు.

### మూగజీవాల బాధను పట్టించుకోని అధికారులు



రెండేండ్ల నుంచి రెండు పశువుల తొట్టెలు నీరు లేక నిరుపయోగంగా మారాయి. నిత్యం పశువులను తోలుకొని సమీపంలో ఉన్న అడవిలోకి వెళ్తాం. వెళ్లే దారిలో రెండు పశువుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. గతంలో బాగానే ఉన్నా.. ఇప్పటి అధికారులు పట్టించుకోక పోవడంతో మూగజీవాలకు నీటిని అందించాలనే సోయి లేకుండాపోయింది. ఎండలు ఎక్కువగా ఉండడంతో పశువులు నీటి కోసం అల్లాడుతున్నాయి. అధికారులు స్పందించి త్వరగా నీటి తొట్లల్లో నీటిని నింపి ఉపయోగంలోకి తీసుకు రావాలి.

**- రమేశ్, పశువుల యజమాని, వెల్‌చాల్, మోమిన్‌పేట**

## సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

### - రూ. 56 లక్షలు బురిడీ కొట్టించిన చీటర్స్

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు రోజుకో రకంగా మోసానికి తెగబడుతున్నారు. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి స్టాక్స్ ట్రేడింగ్ చేస్తే లాభాలొస్తాయంటూ నమ్మించి రూ. 56.12 లక్షలు సైబర్ దోపిడీకి పాల్పడ్డారు. రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు .. సైనిక్‌పురికి చెందిన ఐటీ ఉద్యోగి. ఈ ఏడాది మార్చి నెలలో ఏ5 అస్క్ ఎక్స్‌క్లూజివ్ ఇన్వెస్టర్స్ అండ్ 1-1వీ1 వీఐపీ గ్రూప్ ఎక్స్ఛేంజింగ్ అండ్ ప్రమోటింగ్ ట్రేడింగ్ అనే వాట్సాప్ గ్రూప్‌లో నంబర్‌ను యాడ్ చేశారు. అందులో ఉన్న వాళ్లు ఫలానా స్టాక్స్ ఈ రోజు చాలా ట్రెండింగ్‌లో ఉంటాయి, ఐపీఓలు ఇలా వివిధ రకాల స్టాక్స్ గూర్చి చర్చించుకుంటారు. దీంతో బాధితుడు మీరు చేసే ట్రేడింగ్ గూర్చి తెలుసుకోవాలని ఉందంటూ గ్రూప్ అడ్మిన్‌ను అడగడంతో మీకు ట్రేడింగ్ యాప్‌లో అకౌంట్ ఉందా అంటూ అడిగారు, లేదనగానే ముందుకు అస్క్ మిన్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి అందు లో హెచ్‌ఎన్‌డబ్ల్యూ(హై నెట్ వర్త్) అకౌంట్‌ను ఓపెన్ చేసుకోవాలంటూ సూచించడంతో అడ్మిన్ సూచనలను ఫాలో అయ్యాడు. ట్రేడింగ్‌పై బాధితుడు పెట్టుబడి పెట్టడంతో అందులో లాభాలొచ్చాయి. ఇలా దఫ దఫాలుగా బాధితుడు రూ. 56 లక్షల వరకు పెట్టుబడి పెట్టా డు. ఈ రోజే నిబంధనలు మారాయంటూ నిర్వాహకులు చెప్పడం తో యాప్‌పై అనుమానం వచ్చి రాచకొండ సైబర్‌క్రైమ్‌పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## 300మంది మందు బాబుల పట్టివేత

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 300 మంది వాహనదారులను సైబరాబాద్ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. 231మంది ద్విచక్రవాహనదారులే ఉండటం గమనార్హం. కాగా 8మంది త్రిచక్రవాహనదారులు, 58 మంది నాలుగు చక్రాల వాహనదారులు, ముగ్గురు భారీ వాహనదారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా బ్రీత్ ఎనలైజర్ పరీక్షల్లో బీఏసీ రేంజింగ్ 50ఎంజీ/100ఎంఎల్ నుంచి 200ఎంజీ/100ఎంఎల్ మధ్యన 278మందికి, 200ఎంజీ/100ఎంఎల్ నుంచి 300ఎంజీ/100ఎంఎల్ మధ్య 17మందికి, 301ఎంజీ/100ఎంఎల్ నుంచి 500ఎంజీ/100ఎంఎల్ మధ్య 5 మందికి బీఏసీ రేంజ్ ఉన్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## ఇక్రమ్ ఇంకా ఇక్కడే..!

- ఢిల్లీ వాసినంటూ నమ్మించి పెళ్లి ..
- పాకిస్థాన్‌కు పంపాలా వద్దా..
- స్పష్టత లేదంటున్న పోలీసులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ):నగరంలో పాకిస్థానీల వివరాల సేకరణలో పోలీసులకు హైదరాబాద్ డిటెన్షన్ సెంటర్‌లో బందీగా ఉన్న మహ్మద్ ఉస్మాన్ ఇక్రమ్ అలియాస్ మహ్మద్ అబ్బాస్ ఇక్రమ్ వ్యవహారం సవాల్‌గా మారింది. పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తులు ఖైదీలుగా ఉన్నా, కేసులు విచారణలో ఉండి పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ వారిని వెనక్కి పంపడానికి కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత లేదని పోలీసులు తెలిపారు. సిటీసైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో డిపోర్టేషన్ సెంటర్‌లో ఇక్రమ్ ఉన్న కారణంగా అతడిని ఇప్పట్లో పాకిస్థాన్‌కు పంపాలా వద్దా అనే విషయంపై క్లారిటీ రావలసి ఉందని సీసీఎస్ పోలీసులు చెబుతున్నారు. నగరానికి చెందిన మహిళ 17 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం దుబాయ్‌కు వెళ్లగా అక్కడ ఇక్రమ్ తాను ఢిల్లీకి చెందిన వ్యక్తినని నమ్మించి ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఆ మహిళ దుబాయ్ నుంచి ఇండియాకు వచ్చింది. ఇక్రమ్ కూడా అక్రమంగా ఇండియాకు చేరుకుని హైదరాబాద్‌కు వచ్చాడు. కాగా మహిళను ఇక్రమ్ వేధించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2018లో ఇక్రమ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక్రమ్ పాకిస్థానీ అని తెలియడంతో పోలీసులు అతడిని 2023 నుంచి డిటెన్షన్ సెంటర్‌లోనే ఉంచారు. ఇక్రమ్ విషయంలో అతడు అక్రమంగా ఇండియాకు రావడంతో పోలీసులు డిపోర్టేషన్‌కు పంపినప్పుడు పత్రాల్లో తప్పులున్నాయంటూ వారు రిజెక్ట్ చేశారని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఇక్రమ్ వ్యవహారాన్ని కేంద్రహోంశాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ‘ఎ’ కథా సంపుటి పుస్తకావిష్కరణ

సిటీ బ్యూరో, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): రిటైర్డ్ పోలీస్ అధికారి, రచయిత చిలుకూరి రామ ఉమామహేశ్వర శర్మ రాసిన ‘ఎ’ కథా సంపుటిని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఈ పుస్తకంలోని కథలు పాఠకుడిలో ప్రశ్నలు లేవనెత్తి.. ఆలోచింపజేసే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. వైవిధ్యత, వాస్తవికత, మానవీయ దృక్పథం, మంచి వచనం, చమత్కారం, ఈ కథల ప్రత్యేకత అని చెప్పారు. స్త్రీ, పురుష సంబంధాల గురించి స్వేచ్ఛగా వ్యక్తపరచడం పాఠకులను ఆశ్చర్యపరుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, బాల సాహితీవేత్త డాక్టర్ పత్తిపాక మోహన్, రచయితలు మహ్మద్ ఖదీర్ బాబు, అనిల్ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, రచయిత్రి మానస ఎండ్లూరి, రచయిత్రి కుప్పిలి పద్మ, తదితరులు పాల్గొన్నారు.